

బీచ్‌లో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం సౌత్, కేపీ పాలెం సౌత్ గ్రామాల్లో విస్తరించి ఉన్న బీచ్ ఆదివారం పర్యాటకులతో సందడి నెలకొంది. పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక ద్విచక్ర వాహనాలలో బీచ్‌కు ఉదయమే చేరుకున్నారు. పలువురు సముద్ర కెరటాలలో స్నానాలు చేశారు. చిన్నారులు ఒడ్డుకు కొట్టుకు వస్తున్న కెరటాలతో ఇసుక తిన్నెలపై ఆటలాడుకున్నారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరవి, కొబ్బరి తోటలలో సహపంక్తి భోజనాలు చేసి సేద తీరారు.



బీచ్‌లో సేద తీరుతున్న పర్యాటకులు

నిండా ముంచింది..!

వరదలతో దెబ్బతిన్న తమలపాకు తోటలు

150 ఎకరాల్లో నష్టం, రైతుల ఆందోళన

ప్రజాశక్తి - ఆచంట

వశిష్ట గోదావరి వరద ఉధృతికి తమలపాకు రైతులు తీవ్రంగా నష్టపోయారు. నాలుగు రోజులుగా తమలపాకు తోటలు నీటిలోనే ఉన్నాయి. దీంతో కుళ్లిపోతుండడంతో రైతులు లబోదిబోమంటున్నారు. లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టిన రైతులు పంటలు దెబ్బ తినడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఆచంట, పాలకొల్లు నియోజకవర్గంలోని ఆచంట, యలమంచిలి మండలాల్లో సుమారు 250 ఎకరాల్లో రైతులు తమలపాకు తోటలు పండిస్తున్నారు. వీటిలో భీమలాపురంలో 30 ఎకరాలు, అయోధ్య లంకలో 70, కనకాయలంకలో 25, ఆనగారలంకలో 10, దొడ్డిపట్లలో 15, అబ్బరాజుపాలెంలో 30, లక్ష్మీపాలెంలో 15, పెదలంకలో దాదాపు 20 ఎకరాల్లో తమలపాకు తోటలు పండిస్తున్నారు.

వ్యయ ప్రయాసాల సాగు..

తమలపాకు తోటల సాగు ఎంతో వ్యయ ప్రయాసాలతో కూడుకున్నది. ఎకరాకు దాదాపు రూ.2.5 లక్షల వరకు అప్పులు చేసి పెట్టుబడి పెట్టారు. గోదావరికి వరదలు ముంచెత్తడంతో తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. లంక గ్రామాల్లో దాదాపు 150 ఎకరాల్లో తమలపాకు పండించిన రైతులది ఇదే దుస్థితి.

ఆగస్టులో శ్రీకారం.. సాగు భారం..

ఏటా లంక గ్రామాల్లో ఆగస్టు నెలాఖరు నాటికి తమలపాకు తోటలకు శ్రీకారం చుడతారు. ముందుగా లంక భూముల్లో అవిసి విత్తనం నాటుతారు. అవిసి కర్రల మీద తమలపాకు తోటలు పాకుతాయి. అవిశ కర్రలు పూర్తిగా ఎదగడానికి మూడు నెలలు పడుతుంది. తరువాత ఎదురు వాసం వేసి పందిరి మాదిరిగా వైరుతో అల్లుతారు. మూడు నెలల తర్వాత అంటే నవంబర్, డిసెంబర్ నాటికి తమలపాకు తీగలు నాటుతారు. మరో మూడు నెలలకు అవి కోతకు వస్తాయి. ఇంచుమించుగా ఫిబ్రవరి నెలాఖరు నుంచి కోత మొదలు పెడతారు. మొదట్లో కొద్దికొద్దిగా ఆకులు కోతకు వచ్చిన ఒకటి రెండు నెల్లల్లో పూర్తిస్థాయిలో పంట దిగుబడి వస్తుంది. ఈ క్రమంలో పంట కోతకు వచ్చేసరికి ఎకరాకు దాదాపుగా రూ.2.5 లక్షల వరకూ పెట్టుబడి అవుతుంది. తమలపాకు తోటలో నెలకు ఒకసారి కోత కోస్తారు.



దొడ్డిపట్లలో నీట మునిగిన తమలపాకు తోటలు

వరదలకు ముందు దిగుబడి బాగానే ఉంది. అయితే ధర లేక రైతులు ఆవేదన చెందారు. ఇప్పటికే ధర లేక దిగాలుగా ఉన్న రైతులను ఆకస్మికంగా వచ్చిన వరదలు నిండా ముంచాయి. తమలపాకు తోటలు 24 గంటల పాటు నీటిలో మునిగి ఉంటే తీగలు కుళ్లిపోయి తోటలు చనిపోతాయి. గత నాలుగు రోజుల నుంచి ముంపులోనే తోటలు ఉండడంతో 150 ఎకరాల్లో పంట పూర్తిగా దెబ్బతిందని రైతులు చెబుతున్నారు.

దిక్కుతోచని స్థితిలో రైతులు..

లంక గ్రామాల్లో తమలపాకు పండించే రైతులు దాదాపు కౌలు రైతులే. ఎకరాకు ఆయా లంక భూముల్లో నీటి వసతిని బట్టి కౌలు రూ.20 వేల నుంచి రూ.35 వేల వరకూ ఉంది. దీంతో రైతులు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టారు. ప్రస్తుత పరిస్థితి నేపథ్యంలో పెట్టుబడి వస్తే చాలు అన్న దయనీయ స్థితిలో రైతులు ఉన్నారు.



వరద నుంచి ఇంకా బయటపడని కనకాయలంక కాజ్‌వే

గోదావరి ముంచింది..

వలవల పెద్దిరాజు, రైతు, దొడ్డిపట్ల

ఐదెకరాలు కౌలుకు తీసుకొని తమలపాకు సాగు చేశాను. పంట బాగా పండింది. అయితే గిట్టుబాటు ధర లేదు. బుట్ట కేవలం రూ.450 మాత్రమే పలుకుతోంది. గతంలో రూ.600 వరకూ ధర పలికింది. ధర పెరుగుతుందని చూస్తున్నా. ఇంతలో గోదావరికి ఆకస్మికంగా వరదలు ముంచెత్తడంతో పంటంతా నాశనం అయిపోయింది.



పెనుగొండ రూరల్ : కుళ్లిన నాట్లు

తేరుకుంటున్న లంక గ్రామాలు

ఇంకా వరద నుంచి బయటపడని కనకాయలంక కాజ్ వే

యలమంచిలి : ఆరు రోజులుగా లంక గ్రామాల ప్రజలను భయపెట్టిన గోదావరి వరద ఆదివారం సాయంత్రానికి చాలా వరకు తగ్గింది. ఈ నేపథ్యంలో లంక గ్రామాలైన పెదలంక, బాడవ, యలమంచిలిలంక, లక్ష్మీపాలెం, గంగడపాలెం, దొడ్డిపట్లపల్లి పాలెం తదితర గ్రామాలు ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నాయి. అయితే కనకాయలంక గ్రామ ప్రజలకు ప్రధాన రహదారైన కాజ్‌వేపై ఇంకా రెండు అడుగుల మేర వరద నీరు ప్రవహిస్తుండడంతో అక్కడ ప్రజలు ఇంకా పడవలపైనే ప్రయాణాలు సాగించాల్సి వస్తోంది. సోమవారం నాటికి కాజ్‌వే పూర్తిగా వరద నీటి నుంచి బయటపడే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ఆరు రోజులుగా లంకల్లో వరద నీరు నిలిచిపోవడంతో పశుగ్రాసం మొత్తం తుడుచుకుపెట్టుకుపోవడంతో ఇప్పట్లో ఆయా గ్రామాల్లోని పశువులకు పశుగ్రాసం దొరికే పరిస్థితులు కనబడక పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు. వీరికి ప్రభుత్వం తరఫున దాణా పంపిణీ చేయాలని పలు ప్రజాసంఘాల నాయకులు కోరుతున్నారు.

పెనుగొండ రూరల్ : కొన్ని రోజుల పాటు ఉగ్రరూపం దాల్చిన వరద గోదావరి ఆదివారం నాటికి కొంత తగ్గింది. గోదావరి ఉధృతికి సిద్ధాంతంలోని పుష్కర ఘాట్లు మునిగాయి. వరద తగ్గడంతో పుష్కర ఘాట్ బురద మయంగా మారింది. లంక గ్రామాల్లోని పల్లపు ప్రాంతాల్లో ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నాయి. దీంతో గోదావరిలో పడవలు రాకపోకలు యధావిధిగా తిరుగుతున్నాయి.

ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా మండలంలో సుమారు వందెకరాలపైగానే వరి నాట్లు నీట మునిగాయి. అయితే కొన్ని పొలాలు నీరు లాగడంతో యథావిధిగా ఉన్నాయి. మరి కొన్ని చోట్ల నీరు లాగకపోవడంతో నాట్లు కుళ్లిపోతున్నాయి. ఈ నేపథ్యంలో చేలను దక్కించుకునేందుకు రైతులు పాటుపడుతున్నారు. పొటాష్ వేయడం వల్ల నాట్లు బతుకుతాయని కొంతమంది రైతులు అంటున్నారు. ఏదేమైనా భారీ వర్షాలు రైతులకు నష్టాన్ని మిగిల్చిందని చెప్పొచ్చు.

హమాలీ కార్మికులపై ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరి వీడాలి


సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బలరాం

ప్రజాశక్తి - భీమవరం

నవ సమాజానికి సేవ చేస్తున్న హమాలీ కార్మికుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వైఖరి విడనాడి సమగ్ర కార్మిక చట్టాన్ని రూపొందించి అమలు చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భీమవరం బజార్ లాగుడు బండ్ల ముఠా కార్మిక సంఘం 29వ మహాసభ భీమవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో ఆదివారం నిర్వహించారు. ఈ సభకు యూనియన్ అధ్యక్షులు కె.వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడారు. పాలకులు మారుతున్నా హమాలీ కార్మికుల బతుకుల్లో వెలుగులు లేవని, కార్మిక వర్గ సమస్యలు పరిష్కారం కావాలంటే ఎర్రజెండా పాలన రావాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదాయం తీసుకురావడంలో కీలకపాత్ర హమాలీ కార్మికులదే అన్నారు. కార్మికుల పోరాడి సాధించుకున్న చట్టాలు నేడు మోడీ రద్దు చేస్తున్నారని, కార్మిక చట్టాలు కాపాడుకోవడం కోసం మరో స్వాతంత్ర పోరాటం తప్పదన్నారు. హమాలీ కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు. వామపక్షాలు అధికారంలో ఉన్న కేరళలో హమాలీ కార్మికులు కనీస వేతనం, సామాజిక భద్రత, ఉద్యోగ భద్రత అమలు చేస్తున్నారని తెలిపారు. కార్మికులంతా ఐక్యంగా పోరాడి హక్కులు కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి గోపాలన్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం లేబర్ కోడ్‌లు రద్దు చేసే వరకూ పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు. ఐక్య పోరాటాల ద్వారా హక్కులు సాధించుకోవాలన్నారు. ప్రభుత్వ పరిశ్రమలు మూతేసి నిరుద్యోగం పెంచుతున్నారని, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని 42 భాగాలుగా విభజించి ప్రయివేటీకరణ చేస్తున్నారని తెలిపారు. ఈ మహాసభలో యూనియన్ కార్యదర్శి బి.వాసుదేవరావు నివేదిక ప్రవేశపెట్టారు. సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా బి.వాసుదేవరావు, అధ్యక్షులుగా కె.వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా పిన్నింటి శ్రీను, పప్పల వెంకట సత్యనారాయణ, ఎన్.వీరుడు, ప్రధాన కార్యదర్శిగా డి.నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శులుగా కలిసేటి శ్రీనివాస్, ఎన్.అప్పారావు, ఎం.భార్గవ, కోశాధికారి కె.కృష్ణతో పాటు మరో 18 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం కార్మికులకు సమగ్ర కార్మిక చట్టాన్ని రూపొందించి అమలు చేయాలని, భీమవరంలో వంద పడకల ఇఎస్ఐ హాస్పటల్ నిర్మించాలని, కార్మికులందరికీ పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని మహాసభ తీర్మానం చేసి ఆమోదించింది.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు గోపాలన్



మాట్లాడుతున్న బలరాం

వంతెన పునరుద్ధరణకు చర్యలు

విప్ బొమ్మిడి నాయకర్

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని జగన్నాధపురంలో కూలిన వంతెన ప్రాంతాన్ని ఆదివారం విప్ బొమ్మిడి నాయకర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వంతెన కూలడంతో ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను అధికారులతో చర్చించి త్వరితగతిన పునరుద్ధరణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. ఆయన వెంట పలువురు కుటమి నాయకులు ఉన్నారు.



జగన్నాధపురంలో కూలిన వంతెన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న విప్ నాయకర్

కాల్ సెంటర్ సేవలను వినియోగించుకోండి

నేడు యథావిధిగా పిజిఆర్ఎస్

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిన మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను ఈ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో అర్జీలు నమోదు చేసుకోవచ్చునన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని డివిజన్, మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాల్లో కూడా సమర్పించుకోవచ్చునన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజలకు సత్వర న్యాయం అందించాలి

జస్టిస్ కృష్ణమోహన్

ప్రజాశక్తి - నరసాపురం

నిబద్ధత, అంకితభావంతో పని చేసి ప్రజలకు సత్వర న్యాయం అందించడానికి కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ న్యాయవాదులకు సూచించారు. ఆదివారం నాడు నరసాపురం న్యాయవాదుల సంఘం ఏర్పాటు చేసిన సమావేశం లో ఆయన మాట్లాడారు. రోజు రోజుకూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా న్యాయవాదులు తమ న్యాయ పరిజ్ఞానాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. దాని కోసం న్యాయవాదులు న్యాయపరమైన అంశాలపైనా, చట్టాలపైనా, న్యాయశాస్త్ర సూత్రాలపైనా చర్చా వేదికలు నిర్వహించి అవగాహన పెంచుకోవాలని సూచించారు. న్యాయస్థానాల్లో క్రమశిక్షణతో వ్యవహరిస్తూ న్యాయస్థానాలు, న్యాయవాదుల మధ్య సత్సంబంధాలు కలిగి ఉండాలన్నారు. ఈ సమావేశానికి నరసాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షులు బూసి విశ్వేశ్వరరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తి ఎ.వాసంతి, సీనియర్ సివిల్ జడ్జి జి.గంగరాజు, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) ఆర్.వరలక్ష్మి, అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎస్.రాజ్యలక్ష్మి, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విన్నా సూర్యప్రకాశ్, ఉపాధ్యక్షులు వైదాని నాగేశ్వరరావు, పూరిళ్ల శ్రీనివాస్, నారిన శ్రీనివాసరావు, నక్కా ఆనంద్ బాబు, తంగెళ్ల వెంకటేశ్వరరావు, కొల్లాబత్తుల చంద్రశేఖర్, గోరింకల వినోద్, రాయసం రాధారాణి పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్‌లో జిమ్మిక్కులు..!

ఆన్‌లైన్ ఫిర్యాదులపై అధికారుల తీరుపై చర్చ

రీఓపెన్ చేసే వీల్లేకుండా 'కోర్టు కేసు' ఆప్షన్ పెట్టి ముగింపు

కోర్టులోలేని అంశాలను ఆ విధంగా ఎలా పెడతారంటూ ఫిర్యాదుదారుల ఆవేదన

ఒకేరీతిలో మత్స్యశాఖ, ఇరిగేషన్ ఉన్నతాధికారులు

జిల్లా అధికారులకు చేరిన ఫిర్యాదుల్లోనే ఈ పరిస్థితంటూ చర్చ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'నిడమర్రు మండలం అడవికొలను గ్రామం తిమ్మారావుగూడెం రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 148 నుంచి 163లో ఉన్న 70 ఎకరాల చేపల చెరువులో ప్రభుత్వానికి చెందిన 94 సెంట్ల పంట భూమి ఉందని రెవెన్యూ అధికారులు తేల్చి హద్దులు విధించడం సైతం జరిగింది. సంబంధిత చెరువులో పంటబోదెను కాపాడాలంటూ మత్స్యశాఖ జిల్లా అధికారికి ఆన్‌లైన్‌లో పిజిఆర్ఆర్ ద్వారా ఫిర్యాదు చేశారు. మండల కమిటీ నివేదిక అనంతరం చర్యలు తీసుకుంటామంటూ ఎండార్స్‌మెంట్ ఇచ్చిన మత్స్యశాఖ జిల్లా కార్యాలయం ఆ ఫిర్యాదు మళ్లీ రీఓపెన్ కాకుండా కోర్టు ఆప్షన్ పెట్టి ముగించింది. దీంతో ఇంకా ఆ ఫిర్యాదు రీఓపెన్ చేసే వీలులేకుండా చేశారు. కోర్టులోలేని అంశాలను కోర్టు కేసు ఆప్షన్‌లో ఎందుకు పెడుతున్నారో అర్థంకాని పరిస్థితి నెలకొంది'

'చేపల చెరువులో ఉన్న ప్రభుత్వ పంట బోదెను రక్షించాలంటూ ఇరిగేషన్ జిల్లా అధికారులకు పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. పంటబోదెను రక్షించాల్సిందిగా నిడమర్రు మండల తహశీల్దార్‌కు లేఖ ద్వారా తెలియజేసినట్లు ఇరిగేషన్ అధికారి ఎండార్స్‌మెంట్ ఇచ్చి కోర్టు ఆప్షన్ పెట్టి ఫిర్యాదును ముగించేశారు. దీంతో రీఓపెన్ చేయడానికి అవకాశం లేకుండా పోయింది. కోర్టులోలేని అంశాలను కోర్టు కేసు ఆప్షన్ ఎందుకు పెడుతున్నారంటూ ఫిర్యాదుదారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.'



From : District Fisheries Officer, Eluru To :- Action : Redressed

తమరి ఫిర్యాదులను అనుసరించి మండల స్థాయి కమిటీ అధికారులకు, తమరి అర్జీ ... కార్యాలయమునకు సమర్పించావలసినదిగా ఆదేశించడమైనది. ది 11-08-2025 తేది ... చెరువు పై తదుపరి చర్యలు కొరకు MLIC జాయింట్ ఇన్స్పెక్షన్ రిపోర్ట్ ను సమర్పించి ... తీసుకోనబడునని ,మరియు సదరు చెరువు పై ఇప్పటికే నిఘా ఏర్పాటు చేయడమైన...

Date : 15-08-2025 09:14:40 AM Pre Visit Photo Post Visit Photo

Redressed Status : Court Case/Civil Issue

కోర్టుకేసు ఆప్షన్ పెట్టి మత్స్యశాఖ అధికారులు ముగించిన ఆన్‌లైన్ పిజిఆర్ఎస్ ఫిర్యాదు

పిజిఆర్ఎస్ (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక) ఫిర్యాదులపై జిల్లా అధికారులు జిమ్మిక్కులకు పాల్పడుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను పరిష్కరించడం వదిలేసి వాటి నుంచి ఎలా తప్పించుకోవవాలన్న ఆలోచన చేస్తున్నట్లు కనిపిస్తోంది. ప్రతి సోమవారమూ జిల్లా కలెక్టరేట్‌తోపాటు, డివిజన్, మండలస్థాయిలో పిజిఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించి అధికారులు ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. ప్రతి సోమవారమూ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే పిజిఆర్ఎస్‌లో 250లకుపైగా ఫిర్యాదులు ప్రజల నుంచి అందుతున్నాయి. సోమవారం జరిగే పిజిఆర్ఎస్‌కు రాలేని వారు ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. ప్రభుత్వం కల్పించిన ఆన్‌లైన్ పిజిఆర్ఎస్‌పై ఇప్పుడిప్పుడే ప్రజలకు అవగాహన ఏర్పడుతోంది. ఈ ఫిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పరిష్కరించాలని ప్రభుత్వం పదేపదే చెబుతోంది. జిల్లా ఉన్నతాధికారులు సైతం పిజిఆర్ఎస్ ఫిర్యాదులపై ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ ఫిర్యాదులపై ఆడిటింగ్ చేసేందుకు కలెక్టరేట్‌లో ప్రత్యేక విభాగం సైతం పనిచేస్తోంది. అయినప్పటికీ ఫిర్యాదు దారులకు న్యాయం అంతమాత్రమే అన్నట్లు తయారైంది. ఆన్‌లైన్‌లో ఏదైనా సమస్యపై మండలాధికారులకు జనం ఫిర్యాదు చేస్తున్నారు. వారు ఆ ఫిర్యాదును ముగించిన (క్లోజ్) తర్వాత తమ సమస్య పరిష్కారం కాకపోతే ఫిర్యాదుదారులు రీఓపెన్ చేస్తున్నారు. వెంటనే ఆ ఫిర్యాదు జిల్లా అధికారులకు చేరుతోంది. గడువులోగా అక్కడ కూడా సమస్య పరిష్కారం కాకపోతే రీఓపెన్ చేస్తే రాష్ట్రస్థాయి అధికారులకు ఫిర్యాదు చేరుతోంది. సమస్యను పరిష్కరించకుండా తమకు తోచినట్లు ఎండార్స్‌మెంట్ ఇచ్చేస్తున్నారు. ఫిర్యాదుదారులు తిరిగి రీఓపెన్ చేస్తే రాష్ట్రస్థాయి అధికారులకు చేరుతుందన్న ఉద్దేశంతో జిల్లా అధికారులు కొంతమంది ఫిర్యాదుదారుల హక్కులను కాలరాస్తున్నారు. ఎండార్స్‌మెంట్ ఇచ్చిన తర్వాత కోర్టు కేసు ఆప్షన్ పెట్టి ఫిర్యాదును ముగిస్తున్నారు. దీంతో ఆ ఫిర్యాదు మళ్లీ రీఓపెన్ కావడం లేదు. దీంతో ఫిర్యాదుదారులకు న్యాయం జరగని పరిస్థితి. జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో ఈ పరిస్థితి ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇరిగేషన్ జిల్లా అధికారులు సైతం ఇదే కోవలో నడుస్తున్నట్లు చెబుతున్నారు. మిగిలిన శాఖల్లో ఈ విధంగా ఎన్ని జరుగుతున్నాయో పరిశీలిస్తే వాస్తవాలు బయటకు వస్తాయి. కోర్టు పరిధిలోని అంశాలను కోర్టు కేసు ఆప్షన్ పెట్టి ముగించడం తప్పుకాదు. కోర్టులోని అంశాలను కోర్టు కేసు ఆప్షన్ పెట్టి ఏవిధంగా ముగిస్తారో అర్థంకాని పరిస్థితి నెలకొంది. పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసినా సమస్యలు పరిష్కారం కావడంలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఫిర్యాదు రీఓపెన్ చేయకుండా అధికారులు చేస్తున్న జిమ్మిక్కులు జనంలో చర్చనీయాంశంగా మారుతున్నాయి. ప్రజల సమస్యల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రభుత్వం చెబుతున్నా అధికారులకు పట్టడం లేదు. నిడమర్రు మండలంలోని చేపల చెరువులో పంట బోదెను రక్షించే విషయంలో తమకు సంబంధం లేదంటూ మండలాధికారులు, మత్స్యశాఖ, ఇరిగేషన్ అధికారులు తప్పించుకుంటున్న పరిస్థితి. కోర్టు కేసు అంటూ ముగిస్తున్న ఫిర్యాదులను జిల్లా ఉన్నతాధికారులు మరోసారి ఆడిట్ పరిశీలించే విధంగా చర్యలు తీసుకోవాలని జనం కోరుతున్నారు.

వెంకటస్వామికి జాతీయ ప్రతిభా పురస్కారం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖాధిపతి డాక్టర్ బూసి వెంకటస్వామి 2025 సంవత్సరానికి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ ప్రతిభా పురస్కారానికి ఎంపికయ్యారు. ఎస్‌పిఎల్‌టిఒ గౌరవ అధ్యక్షులు డాక్టర్ కెఎస్.లక్ష్మణరావు, రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నాగయ్య ఒక ప్రకటనలో తెలియజేశారు. దక్షిణాది రాష్ట్రాలలో అత్యంత ప్రతిభావంతులైన, వివిధ రంగాలలో నిష్ణాతులైన వారిలో తమను ఎంపిక చేయటం ఆనందంగా ఉందని, తెలుగు భాష, సాహిత్యంలో కృషి చేస్తున్నందుకు ఈ సత్కారం అందుకోనున్నట్లు డాక్టర్ వెంకటస్వామి తెలియజేశారు. సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని గుంటూరులోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈనెల 31వ తేదీన జరిగే కార్యక్రమంలో పురస్కారాన్ని అందుకోనున్నట్లు వారు తెలియజేశారు. డాక్టర్ బూసి వెంకటస్వామి ఇప్పటికే దాశరథి స్మారక పురస్కారం, గుర్రం జాషువా స్మారక పురస్కారం, గురజాడ స్మారక పురస్కారం, సిరి మంజిరి జాతీయ పురస్కారం, గురుబ్రహ్మ, ఆచార్య దేవోభవ అవార్డులతో పాటు 2024 సంవత్సరంలో మద్రాస్ విశ్వవిద్యాలయ ఉగాది పురస్కారం, తన్నీరు కోటయ్య స్మారక జాతీయ పురస్కారం, 2015వ సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంచే స్టేట్ బెస్ట్ టీచర్ అవార్డులను పొంది ఉన్నారు. వీరి పర్యవేక్షణలో ఇప్పటికే 12 మంది పిహెచ్‌డి అవార్డులు అందుకున్నారు. వివిధ విశ్వవిద్యాలయాల్లో, కళాశాలలో జరిగే జాతీయ అంతర్జాతీయ సదస్సులో పాల్గొని సప్రమాణికమైన పరిశోధనా పత్రాలు సమర్పించారు. కర్ణాటక సార్వత్రిక విశ్వవిద్యాలయం-మైసూర్, బెంగుళూర్ విశ్వవిద్యాలయం, నార్త్ బెంగుళూర్ విశ్వవిద్యాలయం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, ఆంధ్ర విశ్వవిద్యాలయం వంటి వివిధ విశ్వవిద్యాలయాలతో పాటు రాష్ట్రంలో ప్రభుత్వ డిగ్రీ, ఎయిడెడ్ కళాశాలల్లో పాఠ్యాంశ నిర్ణాయక సభ్యులుగా వ్యవహరిస్తున్నారు. డాక్టర్ బూసి వెంకటస్వామికి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ ప్రతిభా పురస్కారం ప్రకటించటం పట్ల కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ తిరువీధుల రాజరాజేశ్వరి, వైస్ ప్రిన్సిపల్ టి.కృష్ణ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.



జ్వరాల బారిన సగంచెరువు వాసులు!

పారిశుధ్య నిర్వహణ లేమితో ఇబ్బందులు

వ్యాధులకు అడ్డుకట్ట వేయాలని వేడుకోలు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని సంగం చెరువు గ్రామంలో సుమారు 30 మందికి పైగా ఆస్పత్రుల పాలయ్యారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారిశుధ్య నిర్వహణ, దోమల నివారణ కార్యక్రమాలు సరిగా లేక ఇలాంటి పరిస్థితులు ఏర్పడ్డాయని గ్రామస్తులు చెబుతున్నారు. గత కొన్ని రోజులుగా వాతావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా జ్వరాలు, దగ్గు, జలుబు, డెంగీ, రక్తకణాల క్షీణత తదితర వ్యాధులతో స్థానిక వైద్యులచే చికిత్స చేయించుకుని తగ్గకపోవడంతో పాలకొల్లులోని పలు ప్రయివేటు ఆసుపత్రులలో చేరి చికిత్స తీసుకుంటున్నారు. ఒక్కొక్క పేషెంట్‌కు సగటున రూ.30 వేలకి పైగా ఖర్చు అవుతుంది. అనారోగ్యంతో అప్పుల పాలవుతున్నామని బాధితులు వాపోతున్నారు. అసలే పనులు లేక సతమతమవుతున్న ఈ తరుణంలో అనారోగ్యానికి గురై తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. ఒకపక్క ప్రభుత్వం మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నామని చెబుతున్నా అవి ప్రజలకు చేరడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఎఎంసి ఛైర్మన్ కోడి విజయభాస్కరరావు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించారు. వైద్య, ఆరోగ్యశాఖ తక్షణమే సంగం చెరువు గ్రామంలో పర్యటించి వ్యాధులను అరికట్టే దిశగా పనిచేయాలని విజయభాస్కర్ కోరారు.



రోగిని పరామర్శిస్తున్న ఎఎంసి ఛైర్మన్

సుధాకర్ రెడ్డి మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం

ప్రజాశక్తి - భీమవరం

కమ్యూనిస్టు నేత, సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం అన్నారు. సుధాకర్ రెడ్డి మృతి పట్ల సిపిఎం జిల్లా కమిటీ తరఫున బలరాంతో పాటు రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ సంతాపం తెలిపి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ సుధాకర్ రెడ్డి బతికనంతకాలం పేద ప్రజల అభ్యున్నతికి పాటుపడ్డారన్నారు. మంతెన సీతారాం మాట్లాడుతూ విద్యార్థి దశనుండే కమ్యూనిజం పట్ల ఆకర్శితుడై ఆయన చనిపోయే వరకు కమ్యూనిజాన్ని వీడలేదన్నారు. విద్యార్థి దశనుండే అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించి, ఆందోళన, పోరాటాలు సాగించారన్నారు. 1998, 2004లో జరిగిన ఎన్నికల్లో నల్గొండ పార్లమెంట్ నియోజకవర్గం నుండి లోక్ సభకు ఎన్నికై ప్రజల పక్షపాతిగా తన గలాన్ని వినిపించారన్నారు. జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ 1960లో కర్నూలు ఎఐఎస్‌ఎఫ్ పట్టణ కార్యదర్శిగా ప్రారంభమైన ఆయన ఉద్యమ ప్రస్థానం సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి వరకు కొనసాగిందన్నారు. జీవితంలో అనేక ఉద్యమాలు నిర్వహించి, ఒడిదుడుకులు ఎదురైనా ఎర్రజెండాను వీడకుండా పోరాటం సాగించారని తెలిపారు.

తాడేపల్లిగూడెం : సిపిఐ మాజీ జాతీయ కార్యదర్శి, మాజీ పార్లమెంటు సభ్యులు, ప్రజా నాయకులు సురవరం సుధాకర్ రెడ్డి కోల్పోవడం బాధాకరమని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబురావు పేర్కొన్నారు. ఆయన మృతి పట్ల జోహార్లు అర్పిస్తూ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. సురవరం సుధాకర్ రెడ్డి విద్యార్థి దశ నుండి అంచలంచలుగా ఎదిగి జాతీయ నాయకులుగా ఎదగడమే కాకుండా ప్రజాప్రతినిధిగా పలు దఫాలుగా ఎన్నికై ప్రజలకు సేవ చేశారని బాబురావు కొనియాడారు. ఆయన మృతిపట్ల సంతాపాన్ని తెలియజేస్తూ, వారి కుటుంబ సభ్యులకి, సిపిఐకి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. దేశంలో లౌకికవాద పరిరక్షణకు, భారత రాజ్యాంగ పరిరక్షణకు వామపక్ష పార్టీల సంయుక్త కార్యక్రమాలు పెద్ద ఎత్తున పెరగాల్సిన అవసరం ఉందని, ఆదిశలో సురవరం సుధాకర్ రెడ్డిని కోల్పోవడం బాధాకరమని బాబురావు ఆ ప్రకటనలో తెలిపారు.


రోడ్డు పైకి చేరిన మురుగు నీరు

రోడ్డుపైనే మురుగు నీరు..!

రోజుల తరబడి నిలిచిపోతున్న మురుగు

తీవ్ర దుర్గంధంతో స్థానికుల ఆందోళన

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - పెనుగొండ

నిత్యం డ్రెయినేజీ మురికి రోడ్డుపై ప్రవహించడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. పెనుగొండ ఇందిరా శాంతినగర్‌లో డ్రెయినేజీలోని నీరు పారే దారి లేకపోవడంతో అక్కడే రోడ్డంతా అధ్వానంగా మారిందని, కొద్దిపాటి వర్షం కురిస్తే ఆ పరిస్థితి ప్రాంతమంతా మురుగునీరు ఇంటి ముందే నిలిచిపోవడంతో దుర్వాసన వెదజల్లుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజుల తరబడి అలాగే ఉండిపోతుందని, దోమలు విచ్చలవిడిగా స్వైర విహారం చేస్తున్నాయని, రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రెయినేజీ నిర్వహణ పరిస్థితి దారుణంగా ఉన్నా, పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవట్లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

సంఘం అధ్యక్షులు బి.హరి కుమార్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని సంఘం అధ్యక్షులు బి.హరికుమార్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల కార్యాలయంలో సంఘం నెలవారీ కార్యక్రమం ఆదివారం సంఘం అధ్యక్షులు బి.హరికుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలను రాష్ట్ర నాయకులు ప్రభుత్వ కార్యదర్శికి విన్నవించుకున్నప్పటికీ, మంత్రివర్గంలో ఉద్యోగుల, పెన్షనర్ల సమస్యలపై ఎటువంటి నిర్ణయం తీసుకోకపోవడం శోచనీయం అన్నారు. కొత్త ప్రభుత్వంలో న్యాయం జరుగుతుందని ఉద్యోగులు, పెన్షనర్లు వారికి మద్దతుగా నిలబడ్డారన్నారు. పాలన సంవత్సరం కాలం పూర్తయినా ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. పెన్షనర్లకు వృద్ధాప్య, అనారోగ్య సమస్యలు పెరుగుతున్నాయని, ప్రభుత్వం వారికి నగదు రహిత వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వై.వి.మూర్తి, వీరారావు, అర్జునరావు, మహమ్మద్ ముస్తఫా, జయరాజు, కృష్ణకుమారి, గాజుల మురళీకృష్ణ, పాపారావు పాల్గొన్నారు.

ప్రార్థనా మందిరంలో ఘర్షణ

మాజీ సర్పంచికు గాయాలు

ప్రజాశక్తి - ఉండి

రెండు తరగతుల మధ్య ఘర్షణ జరిగిన నేపథ్యంలో మండలంలోని చినపుల్లేరు గ్రామ మాజీ సర్పంచి రంపసోలు రాజుకు గాయాలయ్యాయి. ఆదివారం మండలంలోని చినపుల్లేరు శివారు తల్లమ్మ చెరువు ప్రార్థన మందిరంలో రెండు తరగతుల మధ్య భవిష్యత్ వాగ్వాదంతో మొదలైన ఘర్షణ వాతావరణానికి దారి తీసింది. దీంతో గ్రామ మాజీ సర్పంచి రంప సోలు రాజుకు, మరికొంత మందికి గాయాలవ్వడంతో చికిత్స నిమిత్తం భీమవరం ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు. దీనిపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

స్వర్ణాంధ్రలో వన్ డే వర్క్‌షాప్

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని సీతారాంపురంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలోని ఎఐ అండ్ ఎంఎల్ విభాగం, ఇన్‌స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో క్లౌడ్ ఫౌండేషన్ ఎజిలిటీ ఎఐ మీద కోర్సెస్ పణి రవీంద్ర వన్ డే వర్క్‌షాప్ నిర్వహించారు. ఎఐ మీద భవిష్యత్ కార్యక్రమాలు, క్లౌడ్ గుర్తి విషయాలను విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం ఈయన లండన్, యుకెలోని మాస్టర్ కార్డులో ఎఐ, డేటా స్ట్రాటజీ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. గతంలో ఈయన స్వర్ణాంధ్ర కళాశాలలో విద్యను అభ్యసించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ కె.వి.సత్యనారాయణ, ట్రెజరర్ కె.వెంకటేశ్వర స్వామి, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, ప్రిన్సిపల్ ఎస్.సురేష్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ ఎ.గోపిచంద్, ఎఐఎంఎల్ విభాగాధిపతి డాక్టర్ బొమ్మ రామకృష్ణ, ఐఐఇ విభాగాధిపతి డాక్టర్ బి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, విభాగ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


నరసాపురం : సుబ్బారాయుడును సన్మానిస్తున్న నాయకులు

ఘనంగా సుబ్బారాయుడు పుట్టినరోజు

ప్రజాశక్తి - నరసాపురం

కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం నరసాపురం పట్టణంలోని రుస్తుంబాదలోని ఆయన నివాసంలో కూటమి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, అధికారులు పెద్ద ఎత్తున విచ్చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఇంటి ప్రాంగణం అంతా సందడి నెలకొంది. కొత్తపల్లి సుబ్బారాయుడుకు ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్, మాజీ ఎంఎల్ఎ బందారు మాధవ నాయుడు, ఆర్‌డిఒ దాసిరాజు, తహశీల్దార్ ఐవిఐ.సత్యనారాయణ విచ్చేసి శుభాకాంక్షలు తెలిపారు.

మొగల్తూరు : రాష్ట్ర కాపు కార్పొరేషన్ ఛైర్మన్, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు పుట్టినరోజును పురస్కరించుకుని అభిమానుల సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని మాజీ ఎంఎల్ఎ కొత్తపల్లి జానకిరామ్ అన్నారు. మండలంలోని పల్లి గ్రామంలో సుబ్బారాయుడు పుట్టినరోజు వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండల నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సుబ్బారాయుడు పుట్టినరోజు వేడుకలకు మాజీ ఎంఎల్ఎ జానకిరామ్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ కొత్తపల్లి నానిలు కేక్ కోసి ప్రజలకు అందించారు. మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జానకిరామ్ మాట్లాడుతూ సుబ్బారాయుడు పుట్టినరోజు పురస్కరించుకుని అభిమానులు చేస్తున్న సేవలు ఎనలేనివని అన్నారు. ఈ సందర్భంగా అభిమానులు ఏర్పాటు చేసి సమకూర్చిన సుమారు 100 చీరలను మహిళలకు అందించారు. అనంతరం స్థానిక ఎస్సీ బాలికల వసతిగృహాన్ని సందర్శించి విద్యార్థులకు అందుతున్న వసతులు, ఎలా చదువుతున్నారు తదితర వాటిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం అభిమానుల సమకూర్చిన భోజనాన్ని విద్యార్థినులకు వడ్డించారు. ఆయా కార్యక్రమాల్లో టిడిపి మండల శాఖ అధ్యక్షులు గుబ్బల నాగరాజు, వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు, ఉప సర్పంచి బోనం నరసింహారావు, దొంగ స్వామి, మైలబత్తుల రాంబాబు, కర్రి వీరస్వామి, పట్టా రజనీకుమారి, దూసరపూడి దొరబాబు, కోటి, పాల రాంబాబు, కౌరు నాగేశ్వరరావు, మెండు రాజేష్, దేశంశెట్టి శ్రీను, పలువురు అభిమానులు పాల్గొన్నారు.


చీరలు అందజేస్తున్న మాజీ ఎంఎల్ఎ జానకీరామ్, నాని

దారి అధ్వానంగా మారి..!

ప్రమాదాల బారిన వాహనదారులు

పట్టించుకోని అధికారులు


గోతులైనా పూడ్చండని ప్రయాణికుల వేడుకోలు

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం నుండి భీమవరం వెళ్లే రహదారి సరిపల్లి వద్ద మార్గం మధ్యలో పడిన గోతుల వల్ల వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నా రోడ్లు, భవనాల శాఖాధికారులు పట్టించుకోనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు, వాహనదారులు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రోడ్ల రూపురేఖలు మారుస్తామని హామీ ఇచ్చి నేడు విస్మరించిందని ప్రజలు వాపోతున్నారు. రోడ్డు మధ్యలో పడిన గోతులకు వాహనదారులు ప్రమాదాల బారిన పడుతుంటే ప్రభుత్వం ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తుందని, కనీసం గోతులైనా పూడ్చాలని వాహనదారులు వేడుకుంటున్నారు. గోతులమయమైన రహదారులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ఆదమరిస్తే ఇక అంతేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోతుల్లో పడి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, ఇటీవల సిపిఎస్ ఫ్యాక్టరీ వద్ద ఉన్న గోతుల్లో పడిన లారీ టైర్ తృటిలో ప్రమాదం తప్పిందని, లేకపోతే ప్రాణ నష్టం కలిగి ఉండేదన్నారు. ఇప్పటికైనా అధికారులు రహదారులు పూర్తిగా నిర్మాణం చేయకపోయినా వెంటనే రోడ్లకు పడిన గోతులను పూడ్చి ప్రమాదాలు నివారించాలని, లేకపోతే ప్రాణనష్టం కలిగే అవకాశాలు ఉన్నాయని, అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు ముక్త కంఠంతో వేడుకుంటున్నారు.


గోతులపడిన గణపవరం-భీమవరం రహదారి


డిఎస్‌సిలో కొలువులకు అభినందనలు


వెంకట కృష్ణను సత్కరిస్తున్న సర్పంచి సోమేశ్వరరావు

ప్రజాశక్తి - కాళ్ల

డిఎస్‌సి 2025 ఫలితాల్లో మెరిట్ లిస్ట్‌లో పెదఅమిరం గ్రామానికి చెందిన బూరాడ వెంకటకృష్ణ స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్‌లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 8వ ర్యాంక్, జోన్ 2 స్థాయి 3 జిల్లాల్లో కలిపి ఉద్యోగాలైన టిజిటి మ్యాథ్స్‌లో 6వ ర్యాంక్, పిజిటి మ్యాథ్స్‌లో 24వ ర్యాంక్, రాష్ట్ర స్థాయి ప్రిన్సిపల్ పోస్ట్‌కు 56వ ర్యాంక్ సాధించి ఒకేసారి 4 ఉద్యోగాలకు అర్హత సాధించడం విశేషం. పెదఅమిరం గ్రామంలో ఆదివారం వెంకటకృష్ణ స్వగృహంలో వెంకటకృష్ణ, వరలక్ష్మి దంపతులను గ్రామ సర్పంచి డి.సోమేశ్వరరావు, తల్లిదండ్రులు బూరాడ సీతాప్రకాశరావు, కనకదుర్గ, స్నేహితులు, బంధువులు పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల హెల్త్ ఆఫీసర్ సరాబు సునీల్, సరాబు ముఖేష్, బూడి శ్రీను, కలిశెట్టి శ్రీను, కిరణ్, బాలు, అప్పారావు పాల్గొన్నారు.

జువ్వలపాలెం గ్రామానికి చెందిన నడిమింటి రాము 2025 డిఎస్‌సి ఫలితాల్లో ఏకంగా నాలుగు కొలువులు సాధించాడు. జువ్వలపాలెంలో నడిమింటి రామును పలువురు పెద్దలు ఆదివారం సత్కరించారు. జువ్వలపాలెం, కాళ్లకూరు గ్రామాలకు వేగేశ్న చిన్న సుబ్బరాజు, వేగేశ్న సోమరాజు, రఘుమండల సత్యనారాయణ, కుటుంబ సభ్యులు లూకలపు కనకరాజు, బాలగోపాలం, శివరామరాజు, బాలగోపాలం భావన, మిత్రులు గరికపాటి రఘురాము, బెవర తారక ప్రశాంత్ కుమార్, ఖేత అశోక్ కుమార్ రామును ఘనంగా సత్కరించారు.


నడిమింటి రామును సత్కరిస్తున్న గ్రామ పెద్దలు


అర్హుల పింఛన్లు తొలగించడం దారుణం

మరోసారి పరీక్షించి పునరుద్ధరించాలి

సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు నాగ శ్రీనివాస్

ప్రజాశక్తి - మొగల్తూరు

వికలాంగత్వం కలిగిన అర్హుల పింఛన్లు తనిఖీల పేరుతో తొలగించడం దారుణమని మదర్ థెరిస్సా వికలాంగుల సంఘం నరసాపురం నియోజకవర్గ అధ్యక్షుడు చిక్కాల నాగ శ్రీనివాస్ అన్నారు. మొగల్తూరులో ఆదివారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. సర్టిఫికెట్లు తనిఖీల్లో భాగంగా నియోజకవర్గంలో వికలాంగత్వం కలిగిన కొందరి అర్హుల పింఛన్లు 40 శాతం లోబడి ఉందంటూ రద్దు చేశారని అన్నారు. అటువంటి వారిని మరోసారి పరీక్షలు నిర్వహించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని నాగ శ్రీనివాస్ కోరారు. ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్ల ఆధారంతోనే వికలాంగులు జీవనం సాగిస్తున్నారని ఆయన అన్నారు. ప్రభుత్వం తనిఖీల పేరుతో వికలాంగుల పెన్షన్లను రద్దు చేయొద్దని కోరారు.


బాలాజీని అభినందిస్తున్న ప్రముఖులు

శిరగాలపల్లి సొసైటీ అధ్యక్షునిగా బాలాజీ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని సరిగాలపల్లి సొసైటీ నూతన అధ్యక్షునిగా ఆ గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు చిలుకూరి బాలాజీ ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు టిడిపి మండల అధ్యక్షులు మామిడిచెట్టు పెద్దిరాజు అధ్యక్షత వహించారు. సభలో బాలాజీ మాట్లాడుతూ సరదాలపల్లి సొసైటీ జిల్లాలోనే ఒక ఆదర్శవంతమైన సొసైటీగా పేరొందిందని, దాని పేరు ప్రఖ్యాతలు మరింత ఇనుమడింపచేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను చించినాడ నార్నిమెరక, యలమంచిలి సొసైటీ అధ్యక్షులు రుద్రరాజు సత్యనారాయణ రాజు, డేగల సత్తి కొండ, బొప్పన హరి కిషోర్, టిడిపి సీనియర్ నాయకులు, యలమంచిలి నీటి సంఘం అధ్యక్షులు ఆరిమిల్లి రామ శ్రీనివాస్, బోనం నాని, కడలి గోపాలరావు, టిడిపి మండల అధ్యక్షులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఐక్య పోరాటాల ద్వారా సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు జిల్లా నాయకులు పివి.ప్రతాప్

అత్తిలి : ఉద్యోగ, కార్మికులు ఐక్య పోరాటాల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని సిఐటియు జిల్లా నాయకులు పివి.ప్రతాప్ పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో సిఐటియు అత్తిలి మండల మూడవ మహాసభ కె.ధర్మేంద్ర అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రతాప్ మాట్లాడుతూ పాలకులు ఎన్నికల్లో చెప్పిన మాటలకు, ఇప్పుడు చేస్తున్న విధానాలకు పొంతన లేకుండా పోయిందని, దీనివల్ల ఉద్యోగులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. కనీస వేతనాలు లేవు, కార్మిక చట్టాలు సక్రమంగా అమలు లేదు, ఉద్యోగ భద్రత లేదు, ఉపాధి అవకాశాలు రోజురోజుకీ తగ్గిపోతున్నాయి, సమస్యలన్నీ ఈ తీరుగా ఉంటే పాలకులు మాత్రం 100 రోజుల పరిపాలన పూర్తి చేసాం అంటూ పండుగ చేసుకుంటున్నారని అన్నారు. సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ సిఐటియు దేశవ్యాప్తంగా లేబర్ కోడ్లు రద్దు చేయాలని, కార్మిక చట్టాలను కట్టుదిట్టంగా అమలు చేయాలని ఆందోళన చేసిందన్నారు. ఆశ, అంగన్వాడీ విఒఎ, బిల్డింగ్ గ్రామపంచాయతీ, విఆర్ఎ తదితర రంగాల సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహించిందని, వాటన్నిటిలోనూ అత్తిలి కార్మిక వర్గం భాగస్వామ్యం అయ్యారని తెలిపారు. మహాసభ ప్రారంభ సూచికగా సిఐటియు పతాకాన్ని ప్రతాప్ ఆవిష్కరించారు. నూతన కన్వీనింగ్ కమిటీ ఏర్పడింది. కన్వీనర్‌గా కె.ధర్మేంద్ర, కో కన్వీనర్‌గా మల్లేశ్వరి మరొక 13 మందితో కమిటీ ఏర్పడింది.

నియోజకవర్గానికి నిధులు కేటాయించాలి

మంత్రి నారాయణను కోరిన ఎంఎల్ఎ

ప్రజాశక్తి - నరసాపురం

భీమవరంలోని నిర్మల్ ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా వచ్చే పుష్కరాల సందర్భంలో నియోజకవర్గానికి అధికంగా నిధులు కేటాయించి, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలని నాయకర్ కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవి, మంతెన, టిడిపి జిల్లా అధ్యక్షులు మంతెన రామరాజు పాల్గొన్నారు.

చవితి మండపాలకు అనుమతులు తప్పనిసరి

పట్టణ సిఐ బోణం ఆదిప్రసాద్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం




వినాయక చవితి వేడుకలకు మండపాల నిర్వాహకులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని పట్టణ సిఐ ఆదిప్రసాద్ తెలిపారు. ఎవరికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా, రోడ్లను బ్లాక్ చేయకుండా మండపాలు నిర్వహించుకోవాలన్నారు. ఊరేగింపు సమయంలో మద్యం సేవించకూడదని, డీజేలు లేకుండా ఊరేగింపులు చేయాలని కమిటీలకు సూచించారు. మండపాల వద్ద సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని తెలిపారు. ఉత్సవ కమిటీలతో కౌన్సిలింగ్ నిర్వహించి సూచనలు చేసినట్లు సిఐ తెలిపారు. సూచనలు పాటించకుండా ఉత్సవాలు నిర్వహిస్తే ప్రభుత్వ ఆదేశాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ ఆది ప్రసాద్ హెచ్చరించారు.

శివాలయ దేవస్థానం ఛైర్మన్‌గా పద్మారావు

ప్రజాశక్తి - కాళ్ల

సీసలి గ్రామంలో వేంచేసిన అన్నపూర్ణ సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం మహోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఆలయ ఛైర్మన్‌గా గణేశ్న పద్మారావు ధర్మకర్తల మండలి సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు, టిడిపి మండల అధ్యక్షులు ఆరేటి రత్న ప్రసాద్, జనసేన మండల అధ్యక్షులు ఎరుబండి రామాంజనేయులు, మాజీ సర్పంచి కత్రేడ్డి శ్రీనివాసరావు, జనసేన సీసలి గ్రామ అధ్యక్షులు నూకల భోగేంద్రబాబు, పుప్పాల బుజ్జి, ఒగిరాల రాజేష్, ఆరేటి దిలీప్, కొటికలపూడి శివకృష్ణ ట్రస్ట్ బోర్డ్ సభ్యులకు అభినందనలు తెలిపారు.


ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు


ప్రెస్ క్లబ్ సభ్యులను సన్మానిస్తున్న రాయల్ క్లబ్ సభ్యులు

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కండి

రాయల్ క్లబ్ అధ్యక్షుడు జక్కం బాబ్జి

నరసాపురం : పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని రాయల్ క్లబ్ అధ్యక్షుడు జక్కం బాబ్జి అన్నారు. వినాయక చవితి సందర్భంగా చిట్టవరంలోని చిరు, పవన్ కళ్యాణ్ సామాజిక భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన వినాయకుని మట్టి ప్రతిమలు, వ్రత పుస్తకం పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గాలి, నీరు మరింత కాలుష్యం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి పౌరునిపై ఉందన్నారు. ఇందుకు గాను వినాయక చవితికి మట్టి ప్రతిమలను, విగ్రహాలను ఏర్పాటు చేసి కాలుష్యరహిత వాతావరణం ఉండే విధంగా అందరూ కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు వినాయక మట్టి ప్రతిమలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాయల్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జక్కం బాబ్జీ, పులి భుజంగరావు, ప్రతినిధులు దేవిరెడ్డి ధర్మారావు, యర్రంశెట్టి దేవేంద్ర ఫణికర్, అరేటి మృత్యుంజయ్, పిప్పళ్ల సుప్రజ, కంచర్ల కాశీ విశ్వేశ్వరరావు, మెగాస్టార్ చిరు, పవన్ కల్యాన్ అభిమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కేతినీడి రంగా, కార్యదర్శి విఎస్.కుమార్, ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు తిరుమాని నాగమల్లేశ్వరరావు, ఉపాధ్యక్షులు చెరుకూరి రాజేష్ కన్నా ఘనంగా సన్మానించారు.

స్కీం వర్కర్లందరూ ఐక్యంగా ఉద్యమించాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

స్కీం వర్కర్ల మీద ప్రభుత్వం అనేక పనిభారాలు పెంచుతుందని, వారికి సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబురావు అన్నారు. సిఐటియు తాడేపల్లిగూడెం రూరల్ రెండో మహాసభ కె.నాగమణి, జి.దీనాస్వరూపరాణి అధ్యక్షతన ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబురావు, సిరపరపు రంగారావు హాజరై మాట్లాడుతూ డ్యూటీ చార్టులో లేని పనులు కూడా అప్పగించి యాప్‌ల పేరుతో పని భారాలు పెంచుతుందన్నారు. స్కీం వర్కర్లందరూ ఐక్యమత్యంతో హక్కుల సాధనకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రంగారావు మాట్లాడుతూ మండల మహాసభల నుండి జిల్లా, రాష్ట్ర మహాసభలు, అఖిలభారత మహాసభల వరకు ఈ సంవత్సరం జరుగనున్నాయని, ఈ మహాసభల జయప్రదానికి కార్మికులంతా సహకరించాలని కోరారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల కోసం తీసుకొచ్చిన సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, పెండింగ్ క్లైమ్స్‌ను పరిష్కరించాలని, మిడ్ డే మీల్స్ కార్మికుల పొట్టలు కొట్టే ప్రయివేటు సంస్థలకు ఇచ్చే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గత మూడు సంవత్సరాల కార్యకలాపాలను సమీక్షించి నూతన కమిటీని 16 మందితో ఎన్నుకున్నారు. మండల కన్వీనర్‌గా జి.దీనా స్వరూప రాణి, కో కన్వీనర్‌గా కసి నాగమణి, కమిటీ మెంబర్లుగా ఆమంచి సత్యనారాయణ, పూరెల్ల కృష్ణ, బుద్ధుల లూధియమ్మ, మిరియాల అన్నపూర్ణ, ఆకుల వెంకటలక్ష్మి, పి.అనంతలక్ష్మి, తుంగ లక్ష్మి, మద్దుకూరి గంగ, దొబ్బ వరలక్ష్మి, మామిడిపల్లి మంగ, వేంపల్లి కనకమహాలక్ష్మి, బి.శైలజ, డి.ప్రభాకర్, కె.కనకలత ఎన్నికయ్యారు.

బీచ్‌లో యువకుడి గల్లంతు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని కెపి పాలెం బీచ్‌లో ఆదివారం సముద్ర స్నానం చేస్తూ ఒక యువకుడు గల్లంతయ్యాడు. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మొగల్తూరు మండలం కొత్తపాలేనికి చెందిన కొత్తపల్లి శ్రీహర్ష తన కుటుంబ సభ్యులతో కలిసి బీచ్‌కి వెళ్లాడు. సముద్ర అలల్లో స్నానం చేస్తూ అలల ఉధృతికి ప్రమాదవశాత్తు లోనికి కొట్టుకు వెళ్లి గల్లంతయ్యాడు. ఆ యువకుని ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు, పోలీసులు గాలిస్తున్నారు.

కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

31 మందికి రూ.20 లక్షల చెక్కుల పంపిణీ

మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్రంలో మంచి చేసే కూటమి ప్రభుత్వంను అన్ని తరగతుల ప్రజలు ఆశీర్వదించాలని, జరిగిన మేలును పదిమందికి చెప్పాలని రాష్ట్ర జల వనరుల అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. సిఎం చంద్రబాబు మానవత్వంతో పేదలకు వైద్య ఖర్చులు అందించాలనే ఉద్దేశ్యంతోనే సిఎం సహాయ నిధిని పునరుద్ధరించారన్నారు. పాలకొల్లులో ఆదివారం ఆయన కార్యాలయంలో నియోజకవర్గంలో పేదలకు వైద్య ఖర్చు నిమిత్తం సిఎం సహాయనిధిని 31 మందికి రూ.20 లక్షల చెక్కులను అందజేశారు. మంత్రి రామానాయుడు మాట్లాడుతూ నాడు జగన్ ఐదేళ్ల పాలనలో ముఖ్యమంత్రి సహాయ నిధులను సైతం పక్కదోవ పట్టించి పేదలకు వైద్యాన్ని పూర్తిగా దూరం చేశాడన్నారు. పేదలకు వైద్య సాయం అందించలేక మానవత్వాన్ని మరిచిన వ్యక్తి జగన్ అని పేర్కొన్నారు. పాలకొల్లు నియోజకవర్గంలోనే ఏడాది కాలంలో 6 కోట్లు 50 లక్షలు వరకు అందించామన్నారు. వారం వారం పెద్ద ఎత్తున ముఖ్యమంత్రి సహాయంగా వైద్యానికి సాయం అందిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో పేద, మధ్యతరగతి తరగతుల ప్రజల వైద్య ఖర్చులకు సిఎంఆర్‌ఎఫ్ సాయం కోసం ఒకసారి దరఖాస్తు చేసుకుంటే ఒక్క రూపాయి ఖర్చు లేకుండా మంజూరైన తర్వాత పిలిచి ఇస్తున్నామని చెప్పారు. గత జగన్ ప్రభుత్వంలో వైసిపి నాయకులకు దరఖాస్తు చేసుకుంటే డ్రెయిన్లు, కాలువల వెంబడి పడవేసే వారని ఆ పార్టీ నాయకుడు దరఖాస్తు చేసుకుంటేనే దిక్కు లేదన్నారు. లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ చంద్రబాబు ఫొటోలు ఇంట్లో పెట్టుకుని ప్రచారం చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా, క్షేమంగా, సంతోషంగా ఉండాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

అమరావతి రాజధాని చాలా సేఫ్

మంత్రి నారాయణ

ప్రజాశక్తి - కాళ్ల

అమరావతి రాజధాని నిర్మాణంపై కొంతమంది చేసే దుష్ప్రచారం ఎవరూ నమ్మొద్దని పురపాలక శాఖ మంత్రి నారాయణ అన్నారు. పెద అమిరంలో నిర్మల ఫంక్షన్ హాల్లో టిడిపి జిల్లా సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి టిడిపి జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి నారాయణ మాట్లాడుతూ అమరావతి రాజధాని చాలా సేఫ్‌గా ఉందన్నారు. వైసిపి ప్రభుత్వం గత ఐదు సంవత్సరాలు మూడు ముక్కలాట ఆడిందన్నారు. ఎక్కడా రాజధాని కట్టలేదన్నారు. 2014, 19లో 9 వేల కోట్లు రాజధానికి ఖర్చు పెడితే అదంతా నాశనం అయ్యిందన్నారు. కూటమి ప్రభుత్వం అనేక సమస్యల్ని పరిష్కరించిందన్నారు. అమరావతి క్యాపిటల్ సిటీ వర్క్ స్టార్ట్ అయ్యి, వేగవంతంగా జరుగుతుందన్నారు. కొండవీటి వాగు, పాలవాగు, గ్రావిటీ కెనాల్, మూడు రిజర్వాయర్లు, 22,500 క్యూసెక్కుల వాటర్ పంప్ చేసే సిస్టం, చాలా పకడ్బందీగా చేశామన్నారు. నెదర్లాండ్స్ వారి వద్ద డిజైన్ చేయించామన్నారు. అమరావతిని కంప్లీట్ చేస్తే వాళ్లని ఛీ కొడతారని నానా ప్రచారం చేస్తున్నారన్నారు. సమావేశంలో ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, భీమవరం, ఉండి పాలకొల్లు, తాడేపల్లిగూడెం, తణుకు నరసాపురం నియోజవర్గం నుంచి నాయకులు పాల్గొన్నారు.

బండి ముత్యాలమ్మ ఆలయంలో యాత్రికులు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో ఉన్న బండి ముత్యాలమ్మ ఆలయం ఆదివారం యాత్రికులతో కలకలలాడింది. మాజీ ఎంఎల్ఎ బందారు మాధవ నాయుడు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని బండి ముత్యాలమ్మ భజన సంఘం సభ్యులు ఆలపించిన గీతాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. ఆలయ కార్యనిర్వహణ అధికారి మోకా అరుణ్ కుమార్, ఛైర్మన్ కడలి మాణిక్యాలరావుల పర్యవేక్షణలో సిబ్బంది, పాలకవర్గ సభ్యులు యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రసాద వితరణ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.